క్లుప్తంగా

లింగ వివక్షపై అవగాహన ర్యాలీ



లింగ వివక్షపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు మహిళలు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో లింగ వివక్షపై వెలుగు సిబ్బంది, మహిళలు గురువారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు సీసీ జయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షత, అసమానతలను తొలగించేందుకు కృషి చేయాలన్నారు. బాలికల పట్ల వివక్ష తగదని, లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే స్కానింగ్ సెంటర్లపై తరచూ నిఘా ఉంచాలన్నారు. లింగ నిర్ధారణ చేస్తే పీసీ అండ్ పీఎన్డీటీ 1994 యాక్టు ప్రకారం రూ.10 వేలు నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా, మూడు నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని ఆమె హెచ్చరించారు. అనంతరం లింగ వివక్ష చూపమని, బాల బాలికలను సమానంగా చూసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

రైఫిల్ షూటింగ్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

పరవాడ: నేషనల్ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భోపాల్‌లో ఈ నెల 3, 4, 5 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఎన్.సుందర్‌రామిరెడ్డి, ఎస్.సురేంద్ర పాల్గొననున్నారని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు తెలిపారు. ఆగస్టులో జరిగిన సౌత్ జోన్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో స్వర్ణ, కాంస్య పతకాలు సాధించిన వీరిద్దరూ జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. పాఠశాలలో గురువారం జరిగిన సభలో వారిని యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, కోచ్ ఎస్.రామ్మోహన్‌రావు, మనీష్, బషీర్, రాజేష్ పాల్గొన్నారు.

హరహరక్షేత్రంలో విశేష పూజలు



శివునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పెందుర్తి: మహాశివుని జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని సుజాతనగర్‌లోని హరహర క్షేత్రంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, మహాన్యాసం జరిపారు. అనంతరం రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. లక్ష రుద్రాక్ష, లక్ష పత్రి పూజలు చేశారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సింహగిరిపై ముగిసిన వరుణ జపహోమం



పూర్ణాహుతి ద్రవ్యాలు సమర్పిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని గడిచిన నాలుగు రోజులుగా సింహగిరి క్షేత్ర పాలకుడు త్రిపురాంతక స్వామి ఆలయంలో నిర్వహించిన వరుణ జప హోమం గురువారంతో శాస్త్రోక్తంగా ముగిసింది. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి హోమం, మహా పూర్ణాహుతి, జపాలు పఠనం విశేషంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వేద పండితులు కాళ్లకూరి సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, అర్చకుడు రమణమూర్తి, వేద విద్యార్థులు హోమం నిర్వహించారు.



పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అదనపు భవనం



పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రధాన భవనం

సాంకేతిక విద్యకు ఊతం.!



- పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలకు మహర్దశ
- రూ. 8 కోట్ల ప్రభుత్వ నిధులతో వసతుల కల్పన
- క్యాంపస్ నుంచే ఉపాధి అవకాశాలు మెరుగు



కళాశాలలో ఆటోక్యాడ్ వెర్షన్‌తో అధునాతన కంప్యూటర్ ల్యాబ్

పెందుర్తి : కళాశాల నుంచే నేరుగా కొలువులో చేరేందుకు టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. విద్యార్థులు ఎంచుకున్న బ్రాంచిలో అత్యున్నత స్థాయిలో తర్ఫీదు పొందితే పరిశ్రమలు మెరుగైన ప్యాకేజీలతో ఆహ్వానం పలుకుతాయి. అందుకే ప్రభుత్వం కూడా సాంకేతిక విద్యకు ప్రాధాన్యత పెంచింది. సాంకేతిక విద్యను అందిస్తున్న విద్యా సంస్థలకు సౌకర్యాలు కల్పిస్తోంది. విద్యార్థుల్లో నైపుణ్యానికి మరింత మెరుగులు దిద్దేందుకు చక్కటి మార్గం సుగమం చేస్తుంది. ఈ క్రమంలో పెందుర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు మహర్దశ పట్టింది. ప్రస్తుతం ఉన్న ప్రధాన భవనానికి అదనంగా మరో భవనం నిర్మాణానికి సాంకేతిక విద్యా శాఖ రూ.8 కోట్లు మంజూరు చేయగా.. ఆ భవనం అదనపు హంగులతో సిద్ధమైంది. ఇటీవలే ప్రారంభోత్సవం జరిగిన ఈ భవనంలో త్వరలోనే పూర్తిస్థాయి తరగతులు, శిక్షణ ప్రారంభం కానున్నాయి.

ఇంక్యుబేట్‌లో అత్యాధునిక అస్త్రాలు

కళాశాలలో మరిన్ని సౌకర్యాల కల్పనకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ చొరవ తీసుకున్నారు. ఈ క్రమంలో మై యాక్సెస్ అనే ప్రైవేటు సంస్థ ముందుకు వచ్చి రూ.7 లక్షల నిధులు వెచ్చించి కళాశాలలో ఇంక్యుబేట్‌లో రోబోటిక్స్, మెకానిక్స్ హబ్ ఏర్పాటు చేసింది. ఈ హబ్ ఆఫ్ రోబోట్రిక్స్, మెకానిక్స్ అత్యాధునిక ఇంజినీరింగ్స్ విభాగంలో నిష్ణాతులైన అధ్యాపకులు ఈ-కాడ్, ఎం.కాడ్, ఫ్యాబ్(3డీ ప్రింటింగ్), రోబోటిక్స్, మెకాట్రానిక్స్, ఎంఎంఏ, టీఐజీ, ఎంఐజీ, మ్యాగ్ వంటి అధునాతన వెల్డింగ్ మెలకువలపై 3డీ డిజైన్‌ను బోధిస్తారు. ప్రస్తుత సాంకేతిక రంగం నిరంతరం అభివృద్ధి చెందుతున్న క్రమంలో దానికి అనుగుణంగా విద్యార్థులకు అత్యాధునిక శిక్షణ ఇవ్వడమే హబ్ లక్ష్యం.

- ఈ అత్యాధునిక ల్యాబ్‌లో కూల్ స్టఫ్ రూపకల్పన చేశారు. విద్యార్థులు కంప్యూటర్‌లో అద్భుతమైన డిజైన్‌లు రూపొందిస్తారు. 3డీ ప్రింటింగ్ డిజైన్‌లు చేస్తారు.
- ఇదే ల్యాబ్‌లో రోబోలను తయారు చేయడంపై పూర్తిస్థాయి శిక్షణ ఇస్తారు. ఈ హైటెక్ బొమ్మల తయారీ విధానంపై నైపుణ్యం మెరుగుపరిచేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.
- మెకాట్రానిక్స్ అంటే మెకానిక్స్, ఎలక్ట్రానిక్స్ సమ్మేళనం. దీనిపై ఈ ల్యాబ్‌లో శిక్షణ ఇచ్చి యంత్రాలకు ప్రాణం పోసే నైపుణ్యాన్ని అందిస్తారు.
- ప్రత్యేక పద్ధతులను ఉపయోగించి లోహ భాగాలను కలపడం(వెల్డింగ్) కూడా ఇక్కడే శిక్షణ ఇస్తారు. బలమైన, మన్నిక ఎక్కువగా ఉండేందుకు దోహదపడే నిర్మాణాలను రూపొందించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుంది. ఇలా ఈ ప్రత్యేకమైన ల్యాబ్‌లో విద్యార్థులు కంపెనీలకు కావలసిన రీతిలో అత్యంత విలువైన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటారు. ఈ నైపుణ్య శిక్షణ తరువాత సూపర్ లాంగ్ ఇంటర్న్‌షిప్ తరహాలో 6 నెలల పాటు సంబంధిత పరిశ్రమలలో శిక్షణ అందిస్తారు. విద్యార్థులు ప్రతిభ కనబరిస్తే అదే కంపెనీల్లో మెరుగైన వేతనాలతో ఉద్యోగం లభిస్తుంది.
- గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్, కోరమండల్, ఎస్ఎస్‌టీఎల్ లాంటి సంస్థలను సంప్రదించారు.

అరుదైన అవకాశం.. స్కిల్ హబ్

పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని రూ.9.7 కోట్లతో నిర్మించి 2018లో ప్రారంభించారు. 22 గదులు ఏర్పాటు చేశారు. సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ బ్రాంచ్‌లు ఉండగా.. ఒక్కో బ్రాంచ్‌కు 60 సీట్లు కేటాయించారు. అదనంగా బ్రాంచికి మరో 6 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే తొలిరోజుల్లో సౌకర్యాల లేమితో కళాశాలలో చేరేందుకు విద్యార్థులు పెద్దగా ఆసక్తి కనబరిచేవారు కాదు. అయితే 2020–21 విద్యాసంవత్సరం నుంచి కళాశాల దశ తిరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాంకేతిక విద్యపై శ్రద్ధ పెట్టడంతో గతేడాది కళాశాలకు రూ.8 కోట్లు నిధులు వచ్చాయి. దీంతో ఇక్కడ 20 గదులతో అదనపు భవనం నిర్మాణం చేపట్టారు.



ఇంక్యుబేట్‌లో రోబోటిక్స్, మెకాట్రానిక్స్ హబ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

అందులో గంగవరం పోర్టు యాజమాన్యం రూ.37 లక్షలు కళాశాలకు సీఎస్ఆర్ నిధులు కేటాయించింది. ఆ నిధులతో 200 స్టూళ్లు, డ్యూయెల్ డెస్క్ టేబుళ్లు తయారు చేశారు. రెండు ల్యాబ్‌లలో 40 కంప్యూటర్లు ఏర్పాటు చేసి అందులో ఆటోక్యాడ్ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేశారు.

అన్ని సౌకర్యాల కల్పనే లక్ష్యం



సాంకేతిక రంగంలో రోజురోజుకు అవకాశాలు మెరగవుతున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మక మెరుగు కోసం సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం కూడా ఆ దిశగా ఆలోచన చేసి అవసరమైన నిధులు మంజూరు చేస్తుంది. అదనపు భవనం నిర్మాణంతో మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం వచ్చింది. కొన్ని సంస్థలు సీఎస్ఆర్ నిధుల కేటాయింపునకు ముందుకు వచ్చాయి. ఇంక్యుబేట్ హబ్‌ను ఏర్పాటు చేసి నైపుణ్యం శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

– డాక్టర్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్, పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాల

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి
- తానాంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పి.ఎస్.రాజు

పరవాడ: రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు అన్నారు. తానాంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాలతో రూపొందించిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్ జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, పి.బోనంగి సర్పంచ్ బి.కల్పన రాజశేఖర్, పార్టీ నాయకులు డెక్క నూకరాజు, బత్తి అప్పారావు, సచివాలయ కన్వీనర్లు గొరుపూటి రమణ, పంచాయతీ కార్యదర్శి మహేష్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో సంక్షేమానికి ప్రాధాన్యం



పథకాల బోర్డు అవిష్కరిస్తున్న నాయకులు

సబ్బవరం : సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కోటాన రాము అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం మండలంలోని పెదగొల్లపాలెం సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విద్య, వైద్యం ప్రజలకు మరింత చేరువ చేసేలా ఆయా రంగాలకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను శతశాతం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సీఎం జగన్ పాలన దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డు, వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, వద్దాది అప్పలరాజు, దాసరి మధు, వరహాలు, ఈవోపీఆర్‌డీ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల మార్గదర్శకాలు పాటించాలి

- కలెక్టర్ మల్లికార్జున
- ఓటర్ల నమోదు, తొలగింపుపై సమీక్ష



కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, బీఎల్‌వోలు

గోపాలపట్నం: ఓట్ల నమోదు, తొలగింపుపై ఎన్నికల మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్‌తో పాటు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఏఈవోలు, ఏఏఈవోలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఫారం-6, 7లను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆన్‌లైన్ ద్వారా 50 నుంచి 100 వరకు ఫారం–7 దరఖాస్తు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా జెన్యూన్ ఓట్లు తొలగించేందుకు యత్నిస్తున్నట్లు గుర్తించామని, వీటిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఎక్కువ స్థాయిలో వచ్చే దరఖాస్తులు స్వీకరించవద్దన్నారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో ఓటు నమోదు శిబిరాల్లో బీఎల్వోలు, సూపర్‌వైజర్లు విధిగా పాల్గోవాలని ఆదేశించారు. సమావేశంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పరవాడ: స్థానిక సంతబయలులో సీఐటీయూ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ గురజాడ గొప్పతనాన్ని వివరించారు. పి.రాంబాబు, పరదేశినాయుడు, రవి, రమణమ్మ, సంతోష్, అప్పలరాజు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఒడిశా మంత్రి



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న ఒడిశా మంత్రి ఉషాదేవి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఒడిశా రాష్ట్ర మంత్రి ఉషాదేవి గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ కనకరాజు అందజేశారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



అగ్నిప్రమాద బాధితులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: పెందుర్తి మండలం గుర్రంపాలెం పంచాయతీ బొడ్డపూడిపాలెంలో జరిగిన అగ్నిప్రమాద బాధితులను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం పరామర్శించారు. బాధితురాలు బాగి రమణి కుటుంబాన్ని కలిసి ఘటనపై ఆరా తీశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇళ్లు కాలిపోయి కట్టుబట్టలతో మిగిలామని బాధితులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. అవకాశం ఉన్నంత వరకు ప్రభుత్వం తరపున సాయం అందిస్తామని అదీప్‌రాజ్ భరోసా ఇచ్చారు. తనవంతుగా రూ.20 వేలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఉప్పిలి కనకరాజు, మధుపాడ అంజి, బొడ్డు సూర్యప్రకాష్, ఉగ్గిన గోవింద, గొరపల్లి శ్రీను, నక్కా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బురం.. మహాకాళీ నృత్యరూపకం



మహాకాళీ నృత్యరూపకంలో సన్నివేశం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమీ 54వ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ప్రదర్శించిన మహాకాళీ నృత్యరూపకం ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన జొన్నలగడ్డ అనురాధ బృందం మహాకాళీ నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. నృత్య రూపకంలో సన్నివేశాలను చక్కని నాట్య ముద్రికలతో పాటు ఆహాభావాలతో రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.రామబ్రహ్మం, వీఎంఏ ప్రతినిధులు రంగరాజన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమం జరిగింది. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణలో చినగదిలి మండలం ఎంఈవో–2 అనురాధ ఇక్కడ ఉపాధ్యాయులకు బోధనలో మెలకువలు వివరించారు. పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు ఎలా పెంచాలో తెలియజేశారు. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి రికార్డులు నిర్వహించాలన్నారు. ఆ రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప శరణుఘోష



కలశాలతో నగర సంకీర్తనలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు



పదునెట్టాంబడి పూజ చేస్తున్న గురు స్వాములు

- ఘనంగా పదునెట్టాంబడి పూజ

పెందుర్తి: సుజాతనగర్ ప్రాంతం బుధవారం రాత్రి అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగింది. ఇక్కడి పూర్ణ పుష్కళ సమేత శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాయలంలో భారీ ఎత్తున పదునెట్టాంబడి పూజ చేశారు. పూజల్లో భాగంగా చినముషిడివాడ పరదేశమ్మ దేవాలయ పీఠం నుంచి 108 కలశాలతో దాదాపు 300 మంది అయ్యప్ప మాలధారులు నగర సంకీర్తన చేశారు. సుజాతనగర్‌లో అయ్యప్పస్వామికి విశేషంగా అభిషేకాలు జరిపారు. అనంతరం దేవాలయ ప్రధాన పూజారి సుబ్రహ్మణ్యశర్మ, మేల్ శాంతి విష్ణు నంబూద్రి చేతుల మీదుగా విశేష పూజలు జరిపారు. పదునెట్టాంబడి(18మెట్లు)పై కొలువైన మణికంఠను భక్తులు దర్శించుకున్నారు. అయ్యప్ప మాలధారులకు చలపాక అప్పారావు సద్ది సమకూర్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నేత అన్నంరెడ్డి అజయ్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన దేముడు, నాయకులు మెంటి మహేష్, శానాపతి శంకర్రావు, దాట్ల మధు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



స్వర్ణపుష్పాలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించాయ.

8 నుంచి మానవ హక్కులపై అవగాహన

ఎంవీపీ కాలనీ: బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మానవ హక్కులపై అవగాహన సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ వాల్‌పోస్టర్‌ను ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు, కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, తదితరులు ఆవిష్కరించారు. నగరంలోని డాక్టర్ ఎల్‌బీ కళాశాల ప్రాంగణంలో ఈ సమావేశాలు జరుగుతాయన్నారు.